కాలవ్యవధానాలు లేని కథ

తకథిమ్..

ఆరోజు.. ఒక్క రోజు మాత్రమే .. బ్రహ్మాండమైన శృంగార చిత్రం .. మీ అభిమాన థియేటర్ వెన్నెల వెండి తెరపై .. చూడండి! మాచి ఆనందించండి!! ఆలోచిస్తే ఆశాభంగం. గొప్ప మలయాళ సెక్స్ చిత్రం 'నిప్పులాంటి చిన్నది' మంచి తరుణం మించిన దొరకదు, రాత్రి రెండవ ఆట మాత్రమే.. నేడే చూడండి!గొప్ప శృంగార..ఇలా సాగిపోతుంది మావూరి సినీగోల అడ్వర్టైజ్‌మెంట్ మధ్య మధ్యన 'తాథిం' అనే వాడి సాగదీసిన గొంతుకి, 'తకథిం' అంటూ తాళం వేస్తే అరిగిపోయిన సినీ రికార్డు.

పేకాభిరామాయణంలో మునిగి తేలుతున్న మా 'సర్కిల్'కి ఆ గోల వినిపించి, మెల్లి మెల్లిగా దూరం కాసాగింది. కాని మా చెవుల్లో మాత్రం పదే పదే అదే అదే .. తప్పకుండా వెళ్ళాలని తీర్మానించేసేరు.

** ** **

ఆశయ సిద్ధికోసం ఒకే త్రాటిపై నిలుచున్నట్లు వూరి యువకులంతా అక్కడే కనిపించారు. మేం కూడా తీసిపోలేదంటూ తలనెరిసిన జుట్లూ, నానా అవస్థలతో టికెట్లు సంపాదించి మేము లోనికి అడుగిడేసరికి, ఒకే [illegible] చూడనే భాగ్యం కాస్తా ఎగిరిపోయింది. సినీ పోస్టర్లపైకి [illegible] పేడ ముద్దల్లా తలో దిక్కున కూలబడిపోయాం. [illegible].. కూతలు.. నవ్వులు.. ఆ గందరగోళానికి ఏ క్షణానైనా టూరింగ్ థియేటర్ తారు రేకులు, తడికెలు విరిగి పైన పడేట్లుగా వున్నాయి. తెరపై బొమ్మ కనిపించేసరికి ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించుకుంది. తల ప్రక్కకి తిప్పితే ఎలాంటి దృశ్యం కళ్ళ జారి పోతుందోనని అందరి కళ్ళూ తెరవైపే.

నిడివి తక్కువగల చిత్రమేమో విశ్రాంతి లేకుండానే కొనసాగుతుంది. కాని '3 రీలు మార్పులు, 6 కట్టింగ్‌లూ' (ఆ థియేటర్‌కి ఒకే ప్రొజెక్టర్ వుంది లెండి) ప్రేక్షకుల సహనాన్ని సవాలు చేస్తున్నాయి. అయినా ముందు కనిపించబోయే 'ఆ', సుందర దృశ్యాల కోసం ఎంతో 'ఇది'గా కళ్ళింతలు చేసుకుని మరింత ఉత్కంఠంతతో ఎదురు చూస్తున్నారు.

కొద్ది సమయానికి అకస్మాత్తుగా తెర శుభం పలికే సరికి, ప్రేక్షకలోకానికి కోపం కట్టలు తెంచుకుంది. ఎంతో ఆశతో 'ఏదో' చూడవచ్చనే ఉబలాటంతో వస్తే, అలాంటిది ఏమీ లేక పోవడంతో నిరాశ నిప్పులు కుమ్మరించే సరికి కుర్చీలపైబడి బీభత్సరసాన్ని ప్రదర్శిస్తూ తలో దిక్కున బయటికి వెళ్ళిపోయారు. తమ 'బాధ'కి ఇలా కొంత ఉపశమనాన్ని కల్గిస్తూ.

చివరగా నేనూ బయటకి వచ్చేసరికి, "ఇలాంటి మంచి తరుణం మళ్ళీ ఎప్పుడు లభిస్తుందా అని మించిపోయిన లాభాన్ని లెక్కిస్తూ కనిపించాడు, మామూలు మసాలా చిత్రానికి సెక్స్ రంగు పులిమి అడ్వర్టైజ్ చేసిన థియేటర్ యజమాని.

—కిషన్.పి.

ఆ ప్రశ్నకి జవాబు ఎన్ని రోజులుగానో తయారు చేసుకుంటున్నా సమయం వచ్చేసరికి గొంతులోంచి బయటకి రానని మొరాయించింది.

మరో పక్క వాసంతి గుమ్మానికి చేరబడి కళ్ళు పెద్దవిచేసి భగ్నప్రేమికురాల్లా చూస్తుందతని వైపు.

"ఇప్పుడేం తొందర వదినా!" అన్నాడు ఎలాగో.

"తొందర నీకు లేక పోయినా మా చెల్లెలికుంది! దానికి పద్దెనిమిది నిండేయి!" అంది సావిత్రి.

ఆ మాటకి వెంటనే జవాబు చెప్పలేకపోయేడు రవీంద్ర.

"నాకప్పుడే యిష్టంలేదు!" అన్నాడు తలదించుకుని గొణుగుతున్నట్లుగా.

సావిత్రి భ్రుకుటి ముడిపడింది.

అసహనంగా భర్త వైపు చూసింది.

"అసలు పెళ్ళే యిష్టం లేదా? లేక వాసంతంటే ఇష్టం లేదా?" అన్నాడు భాస్కర్రావు తీవ్రంగా.

"నేను వాసంతినెప్పుడూ ఆ దృష్టితో చూడలేదు!" అన్నాడు రవీంద్ర మెల్లిగా.

భాస్కర్రావు వెటకారంగా నవ్వేడు. "ఆ కొండ మీద ఎవర్తినో చూసుకునే సరికి నీ దృష్టి సడెన్‌గా మారిపోయినట్లుంది. నీ కథలు నాకు తెలీవనుకోకు!" అన్నాడు.

రవీంద్ర జవాబు చెప్పలేదు.

అతని మౌనాన్ని చూసి రెచ్చిపోయేడు భాస్కర్రావు.

"ఛీ! ఎక్కడ చూసినా వీడి టాపిక్కే! ఏనలేక ఛస్తున్నాననుకో! ఏదో చిన్నతనం అని చూస్తూ వూరుకుంటే... మితిమీరి పోతున్నాడు. మొన్న రాత్రి ఎక్కడున్నాడో అడుగు!" అన్నాడు భార్య వైపు తిరిగి.

"మీరూరుకోండి! అసలు సంగతి నేను కనుక్కుంటానుగా! ఆడది కాదని బరితెగిస్తే మగవాడిదేం పోతుంది! ఏదో ఎర్రగా బుర్రగా వున్నాడని వలలో వేసుకుంటుంది! నాల్గు రోజులు పోతే ఏది మేలిమి బంగారమైంది—ఏది నకిలీ సరుకయిందీ అతనే తెలుసుకుంటాడు!" అంది సావిత్రి గొంతులోకి ఎక్కడ లేని సౌమ్యతా తెచ్చుకుంటూ.

"తెలుసుకుంటాడు, తెలుసుకుంటాడు! ఈ లోపున కొంపలంటు కుంటాయి! నువ్వే వాడి కసలు ఎక్కడలేని అలుసిచ్చింది!" అన్నాడు భాస్కర్రావు. భార్య మీద మండిపడుతూ.

తాటాకు మంటలాంటి భర్తకోపాన్ని చూసి తేలిగ్గా నవ్వేసింది సావిత్రి.

"బాగుంది వరస! చేతి మీద ఏదో లేచిందని చెయ్యే నరుక్కోంగా! ఏదో చిన్నతనం! ఆ మాటకొస్తే ఈ రోజుకి మిమ్మల్నా రెండో పెళ్ళాం దగ్గర కెళ్లకుండా ఆపగల్గేనా? ఎవరి బలహీనతలు వాళ్ళకి తెలియవు!" అంటూ మరిది వైపు తిరిగింది సావిత్రి.

"నాయనా రవీ!" అంది ఎంతో ప్రేమగా.

రవి ఆ పిలుపుకి కరిగిపోయినట్లుగా అయ్యేడు. ఎంత కాదనుకొన్నా చిన్నతనం నుండీ అల్లుకొన్న అనుబంధం అది!

తనకి ఊహ తెలిసేసరికే తల్లిలా ఆ యింట్లో ప్రవేశించింది సావిత్రి. తల్లిలేని తనని తల్లిలాగే ఆదరించింది. ఆమె ప్రేమలో కపటం వుందని అనుకోలేదు! కాకపోతే కొద్ది పాలు స్వార్థం! తను పెంచిన మొక్క కాయలు తనకే చెందాలనే ఆరాటం!

రవీంద్ర తలెత్తి వదిన గారి వైపు చూసేడు.

ఆమె అతని పక్కనే కూర్చుని అతని భుజమ్మీద తన చెయ్యేసింది ఆత్మీయంగా.

" నీ మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాను! తల్లి లేని నువ్వు తల్లిలేని వాసంతిని కట్టుకుని ఆదరిస్తావని కలలు కన్నాను! నీ చిన్నతనంలోనే నా మనసులో కల్గిన ఈ కోరిక ఈనాటికి మహా వృక్షమైపోయింది! దాన్ని కాదనకు నాయినా! నేను తట్టుకోలేను!" అంది ఎంతో ఆవేదనగా.

అలా చెబుతున్నప్పుడు ఆమె కంఠం సన్నగా వణికింది. కళ్ళలో నీళ్ళు లీలగా చిప్పిల్లేయి!

"అది కాదొదినా!" అన్నాడు రవీంద్ర మెత్తగా.

"ఏది కాదు! ఆ అమ్మాయితో నీ కున్నది ప్రేమ కాదని చెప్పు! అది పెళ్ళివరకూ పోలేదని చెప్పు! వాసంతిని కాకుండా మరొకర్ని కలలోకూడా చేపట్టనని చెప్పు!" అంది సావిత్రి ఎంతో ఆవేశంగా.

రవీంద్ర వదినగారి ఆవేశానికి అప్రతిభుడయి చూసేడు.

"మాట్లాడవేం?" అంటూ రెట్టించింది సావిత్రి.

"నేను నీకెలా చెబితే అర్థమవుతుంది వదినా!" అన్నాడు బాధగా.

భాస్కర్రావు తమ్ముడి వైపు కొరకొరా చూసి "వున్నది వున్నట్లు ఏడు! చాలు!" అన్నాడు కోపంగా.

సావిత్రి భర్త వైపు చూసి ఊరుకోమన్నట్లు సైగ చేసింది.

"నువ్వెలా చెప్పినా నాకర్థమవుతుంది! కాని... నాకు కావాల్సింది నిజం!" అంది దృఢంగా.

రవీంద్ర ఒక నిముషం మౌనం వహించేడు.

"నేను... నేనామెను ప్రేమించేను వదినా!" అన్నాడు ఎలాగో.

అతని మాటకి హాల్లో వున్న ముగ్గురు వ్యక్తులూ బాంబు ప్రేలినట్లు ఉలిక్కిపడ్డారు.

వెంటనే ఏం మాట్లాడటానికి తోచనట్లు అలాగే మలచిన బొమ్మల్లా నిలబడిపోయేరు!

"నీకు...నీకు గాని పిచ్చెక్కిందా? ఎవర్తో నీతి జాతి తెలియని ఒంటి గత్తెని ప్రేమించేడట! దానిమీద రకరకాల పుకార్లున్నాయి!" అన్నాడు భాస్కర్రావు మండిపడుతూ.

(—సశేషం)

గమనిక

మా వారపత్రికలో ప్రచురించిన 'రాముడుండాడు-రాజ్జివుండాది' సీరియల్ నవలలో విశ్వబ్రాహ్మణ సంఘాల వారికి మనస్తాపం కలిగించే ప్రస్తావనలు అక్కడక్కడ, ప్రమాదవశాత్తూ వచ్చినందుకు వారి అభిప్రాయాలను మన్నిస్తూ మా క్షమాపణలు తెలియ జేస్తున్నాము.

—ఎడిటర్